# ఆశయాలు - ఆచరణ

రచన:
కుమారి బలుసు సరళ

మా గులాబీల తోటలో కూర్చున్నాను. కావాలని ఎన్నోరకాల గులాబీ చెట్లను తెప్పించి, ఎంతో ప్రేమతో పెంచుకున్న తోట అది. దానికోసం ఎంత శ్రమ పడినా, నాకు బాధ అనిపించదు. విచ్చుకున్న గులాబీలను చూస్తుంటే... నన్ను నేనే మైమరచిపోతుంటాను.

అందులో తెల్ల గులాబీ! దానికి నా హృదయంలో ప్రత్యేకత వుంది. దానికి కారణం తెల్ల గులాబీలాంటి స్వచ్ఛమైన మనసుగల నా స్నేహితురాలు కమల తెచ్చి నాటిన చెట్టు అది!

ఆ చెట్టు గుబురుగా పెరిగి, అందమైన తెల్ల గులాబీల నెన్నింటినో అందించింది. అలాగే...కమల కూడా తన చిన్నారిపాపలను ఎప్పటికి అందిస్తుందో?

మాఘమాసం వచ్చేస్తోంది! పెండ్లి జరిపే రోజులు కదా! కమలకి వివాహం కుదిరితే బాగుండును. పెండ్లి కూతురు ముస్తాబు నేనే చేస్తాను, పట్టుచీరలో, పూవుల జడలో, చక్కటి బాసికం నుదుటున మెరుస్తుంటే... కమల ఎంతందంగా వుంటుందో? ఆ రూపంలో కమలని నేను చూడాలి.

మృదువైన చేతులు నా కన్నులను గట్టిగా మూశాయి. ఆలోచనలనుండి బైటపడ్డాను. ఆ స్పర్శ నాకు చాలా సన్నిహితమైనది.

'కమలా! అబ్బా! వదలవే బాబూ! కన్నులు నొప్పి పుడుతున్నాయి' తన చేతులను తొలగించాను.

కమల చిరునవ్వుతో నిలబడి, అడిగింది 'నేనని ఎలా తెలుసుకోగలిగావు.'

'ఓస్! ఆ మాత్రం తెలుసుకోలేనా? గులాబీ మృదుత్వాన్ని, నీచేతి మృదుత్వాన్ని ఎంత గాఢాంధకారంలోనైనా గుర్తింపగలను.'

'ఆహా! మరి మీ శ్రీవారి చేతి మృదుత్వాన్నో?'

'పోవే! అల్లరి కమలా! ముక్కుపట్టుకుని గట్టిగా లాగాను. కమల ముఖాన్ని విదిలించుకుని చిలిపిగా నవ్వింది. కుడి బుగ్గనున్న చిన్ని సొట్ట ఆమెకు మరింత అందాన్ని పులిమింది. అలాగే పరిశీలనగా చూస్తూ అడిగాను. 'ఏమిటి విశేషం? ముఖంలో వంద ఓల్టులబల్బు కాంతి వెలిగిపోతోందేమిటి చెప్పా?'

'పెద్ద విశేషమే! ఏమిటో నువ్వు చెప్పుకో చూదాం?'

ఎంతగానో ఆలోచించి చూశాను. కారణం నాకేం అర్థం కాలేదు...

ఏమిటో నబ్బా!'

'అది నీకరం కాదులే. చెప్పినా నమ్మవు.'

'చెబితే ఎందుకు నమ్మను?'

'ఒక వరుడు కట్నాన్ని ఆశించకుండా, మీ అమ్మాయిని పెండ్లి చేసుకుంటానంటూ వధువు తండ్రికి ఉత్తరం వ్రాశాడంటే నమ్ముతావా?'

'అసంభవము. నేను చస్తే నమ్మను. ఇదేదో కట్టు కథలాగా వుంది.'

'కట్టుకథ కాదే! ఇది నిజం!' నమ్మించాలని ప్రయత్నం చేస్తోంది కమల.

'ఓసి పిచ్చి కమలా! ఎందుకు నన్ను నమ్మమంటావు.. ధనమెవరికైనా చేదా?'

'కొంతమంది తమ ఆశయాలకోసం ధనాన్ని ఆశించక పోవచ్చు!'

'ఓ...హో...హో...ఏమి నమ్మకమే! ఎవరా ఆదర్శ యువకుడు? కాస్త సెలవీయి తల్లీ!'

నామాటలు కమలకి బాధని కలిగించాయనుకుంటాను. ముఖాన్ని గంభీరంగా పెట్టి అంది 'నీ కన్నీ వెటకారాలే! నిజాన్ని చెప్పినా తేలికగా కొట్టి పారేస్తావు. ఈ ఉత్తరాన్ని చదువు. ఆదర్శ యువకులున్నారంటే ఇప్పటికయినా నమ్ముతావు.'

కమల చేతినుండి ఉత్తరాన్ని అందుకుని, విప్పి చదవడం మొదలుబెట్టాను.

'శ్రీ రామకృష్ణయ్య గార్కి–'

నమస్కరించి వ్రాయునది–మన పరిచయం ఒక విధంగా ఇలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికి అనువైనది కాదనుకుంటాను. నేను స్వతంత్రించి, మా పెద్దలకు తెలియకుండానే మీతో మాటాడాను. అందుకని మన విషయాలు ఇలా స్వేచ్ఛగా సాగిపోవాలని నా అభిలాష. నా మనసులోని మాట చెబుతాను, కొన్ని ఆశయాలు పెట్టుకుని, ఏవో ఆదర్శలంటూ ఇన్నాళ్ళూ అనుకుంటూ, ఏవేవో ఊహిస్తూ బ్రతికాను.

ఇక మీ అమ్మాయి. పూర్తిగా వచ్చే విషయం... ఆమెతో ఇంటర్వ్యూ జరిగాకే చెప్పగలను. కొంతమంది సాంప్రదాయాల ప్రకారం కాబోవు వధువుతో మాట్లాడడం కష్టం. కానీ... నేను మీ అమ్మాయితో కనీసం ఒక అరగంట అయినా మాట్లాడకుండా పెండ్లికి ఒప్పుకోలేను, ఇది మీకు ఇష్టమేనా?

ఇక కట్నాల విషయం:- నేను కట్నాన్ని ఆశించే వ్యక్తిని కాదు. అది నా ఆశయానికే విరుద్ధం! నాకు కట్నం తీసుకోవాలని లేదు. కట్నం కోరుకునే వరుడెవ్వడూ ఇలా చెబుతాడని ఎవరూ ఊహించరు. బహుశా: నేను ఇలా వ్రాస్తున్నందుకు నా ఆలోచనలను గురించి మరొక విధంగా భావించవచ్చు. ఒకవేళ జీవితం మీద అనుభవం లేక అలా చెబుతున్నానని మీరు అనుకోవచ్చు. అయినా నా ఆలోచన నేను మార్చుకోలేను. ఇలాంటి విషయాలలో మా ఇంటిదగ్గర పెద్దవారితో పేచీలు వస్తాయి. అలాంటి పరిస్థితులలో కూడా మీరు పెండ్లికి ఏర్పాట్లు చెయ్యగలరా?

ఇక ఆఖరిమాట! నేను పైన చెప్పిన విషయాలు మన ఇరువురికి సంబంధించిన విషయాలు. నా ఆదర్శాల వలన ఎలాంటి పేరు (చెడుగాని, మంచిగాని) సంపాదించాలని నాకు ఆశ లేదు. అందువలన ఈ విషయాలు మీతోనే ఉంచుకోవాలని ప్రార్థన. ఈ ఉత్తరం వలన నా ఆశయాలు, ఉద్దేశాలు మీకు తెలిసే వుంటాయనుకుంటాను.

నా అభిప్రాయలతో మీరు ఏకీభవిస్తే, నేను మీ అమ్మాయిని చూడడానికి వస్తాను. వెంటనే ఏ విషయం తెలుపకోర్తాను-ప్రతాప్.

ఉత్తరాన్ని చదవడం పూర్తిచేసి, ఒక్క క్షణం ఆశ్చర్య చకితురాలయ్యాను.

'ఏమిటలా ఐపోయావు? శాస్త్ర యీ లోకంలోకి దిగిరా.'

కమల మాటలకు నాలో చలనం కలిగినట్టయింది. 'అరే! తమాషాగా వుందే! భలే ఆశ్చర్యం!'

'ఇప్పటికైనా నమ్ముతావా? ఆదర్శ యువకులంటూ వున్నారంటే?' కమల నా భుజం పట్టుకుని కదుపుతూ అడిగింది.

కమలా! సాక్ష్యం కనబడుతుంటే నమ్మక తప్పదం లేదే! సరే! మంచి పనేగా. ఈ వరుడయినా నిన్ను పెండ్లాడితే... చాలా సంతోషము కమలా! నేను కోరుకునేది కూడా అదే. నాలో సంతోషము కట్టలు త్రెంచుకుని ప్రవహిస్తోంది.

కమల నిర్లిప్తంగా నవ్వింది. ఆ నవ్వయినా ఒకక్షణం ఆమె ముఖంమీద తాండవించింది. ఆ తరువాత నెమ్మదిగా అంది. ఆ వరునికి నేను నచ్చాలి గదా?'

'ఎందుకలాంటి అనుమానం వచ్చింది?!

'స్వతంత్ర అభిప్రాయాలు గల వ్యక్తి! నేను నచ్చుతాననే నమ్మకం ఏమిటి?'



Sakthi

మీ

- వ్యవసాయానికి
- పరిశ్రమలకు ఉత్తమమైనది.
- మోటారులు
- పంపులు
- మోనోబ్లాక్ సెట్లు.

తయారించువారు

శ్రీ శక్తి ఇంజినీరింగ్ వర్క్స్

పీలమేడు : : కోయమత్తూరు-4

SRI SAKTHI ENGINEERING WORKS
PEELAMEDU P.O. COIMBATORE-4. S.INDIA

'దివ్యంగా నచ్చుతావు. బాధపడకు. నేను నీ ప్రక్కనే వుంటానులే.'

'ఎందుకూ?. నన్నొక సినీక్లబ్ లోని స్టార్‌లా అలంకరించడానికా? ఆపనికి మాత్రమయితే ఒప్పుకోను.'

'లేదులే. పాపం! బొమ్మలా...ఇంత కొప్పు పెట్టుకుని, ముక్కుకి బులాకు తగిలించుకుందువుగాని.' వెక్కిరిస్తూ అన్నాను.

లేదు లేదు, ఈ పని మాత్రం చేయను, అతి సామాన్యంగా కనబడడం నా కిష్టం.'

'సరే లేవే తల్లీ.' అలాగే కనపడుదువు గాని, ఇంతకీ ఆ వరుడెప్పుడట వస్తా?' ఆసక్తితో అడిగాను.

'ఇంకా రెండు రోజులకి. నువ్వు తప్పకుండా రావాలి సుమా!'

'ఎస్. ప్రామిస్.'

నా దగ్గర మాట తీసుకుని కమల-వెళ్ళిపోయింది. కనుచూపు మేరవరకు ఆమెని చూస్తూ వుండిపోయాను.

Tel: "TWINBIRDS" Phone : 818

P.V.S. KNITTINGS
TRADE MARK
TIRUPUR

Use Always our
P. V. S. "TWINBIRDS" (R)
AND
"Tower Knitting Mills"
Banians.
MFGR'S
**P. V. S. KNITTINGS**
16/12, AZAD ST., : : TIRUPUR-1.

ఎదురు చూస్తున్న ఆ రోజు రానే వచ్చింది. తెల్లగులాబీలను గుత్తిగా చేసి, వాటితో కమల ఇంటికి వెళ్లాను.

'రామ్మా!' ఆహ్వానించారు కమల నాన్నగారు.

ఆయన ముఖం సంతృప్తితో వెలిగి పోతోంది. హృదయంలోని సంతోషాన్ని ఆయన కన్నులు చాటి చెబుతున్నాయి.

'నమస్కారం బాబాయిగారూ!' అంటూ హాలులోనికి అడుగు పెట్టాను. నన్ను చూడగానే కమల సంతోషంతో నా దగ్గరికొచ్చి అడిగింది. 'ఇంత ఆలస్యంగా వచ్చావేం?'

'ఏమి చెయ్యమంటావే? చిన్న బాబుని వదిలించుకుని వచ్చావే?'

'ఏమి చెయ్యమంటావే? చిన్న బాబుని వదిలించుకుని వచ్చేటప్పటికి ఈ వేళయింది. ముందుగానే వద్దామనుకున్నాను.' సంజాయిషీ చెప్పుకున్నాను.

అవునమ్మా. ముగ్గురి పిల్లల తల్లివికదా! ఒంటరిగాళ్ళలా తిరగడానికి ఎలా వీలవుతుంది?' కమల నాన్నగారు సమర్థించారు.

కమలా! త్వరగా రెడీ అవ్వండి! వరుడు వచ్చే వేళయింది. నేను స్టేషనుకు వెళ్ళి, అతనిని తీసుకుని వస్తాను. గడియారాన్ని చూసి హడావిడిగా ఆయన బజారులోకి వెళ్ళారు.

సన్నగా, ఎఱుపు చాయతో వుండే కమల ఊదా రంగు జరీ చీరలో మరింత అందంగా మెరిసిపోతోంది. నేనిచ్చిన గులాబీ గుత్తిని తలలో తురుముకుంది.

'ఈ వేళ చాలా అందంగా వున్నావు సుమా!' వుండబట్టలేక అనేశాను. కమల విచ్చుకున్న గులాబీలా నవ్వింది. ఆ నవ్వులో చల్లని వెన్నెల కురిసినట్టయింది. కమల జీవితం ఎప్పుడూ-ఇలాగే నవ్వుతూ గడిచిపోతే' ఎంత బాగుండును!

వెళ్ళిన పదినిమిషాలకే కమల నాన్నగారు జ్వరపడి, నీరసంగా వున్న వ్యక్తిలా లోనికొచ్చి, కుర్చీలో కూర్చుని, చేతులతో ముఖాన్ని కప్పుకుని, చంటిపిల్లాడిలా దుఃఖిస్తున్నారు,

ఆయనను చూడగానే కమల, నేను క్షణకాలం చలనం లేని బొమ్మలా అయిపోయాము. తేరుకుని నేనే అడిగాను. 'ఏమయింది బాబాయి గారూ?'

'ఇంకేముందమ్మా? నా ఆశలన్నీ కూలిపోయాయి భోరున ఏడుస్తున్నారాయన.

కమల ఆ మాట వినడంతోనే, తన ముఖాన్ని క్రిందికి దించుకుని, తడబడుతూ, ప్రక్కగదిలోనికి వెళ్ళిపోయింది.

నాకు తెలుసు! ఇప్పుడు ఆమె తనలో తను లేదని!'

కమలని నా హృదయానికి హత్తుకుని, ఓదార్చాలని పించింది. కానీ...ఆమె నాన్నగారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా వుంది.

నెమ్మదిగా ఆయన దగ్గరి కెళ్ళి...సవినయంగా అడిగాను. 'చెప్పండి బాబాయిగారూ! జరిగిన సంగతి?'

'ఈ ఉత్తరం చదువమ్మా! నీకే తెలుస్తుంది!' కవరు అందించారాయన. ఆత్రుతగా విప్పి చదవడం ఆరంభించాను.

'శ్రీరామ కృష్ణయ్యగారూ!'

నమస్కారము! ఇలా ఉత్తరం వ్రాయవలసి వస్తుందని నేను అనుకోలేదు. నే నిప్పుడు ఆచరణ లేని ఆశయాలు గల నవపెండ్లి కుమారుడిని! పెండ్లి పసుపు బట్టలు విప్పకుండానే నేనీ ఉత్తరం మీకు వ్రాస్తున్నాను. క్షమించమని అడగడానికి కూడా అర్హత కోల్పోయిన వాడిని. మీకు ఆశ కల్పించి, నిరాశ పరిచిన వాడిని! నలభై వేలుకి అమ్ముడు పోయిన ఇంజనీరుని!

ఆ రోజున మద్రాసు రైల్వేస్టేషనులో మీ పుత్రుడు మీరు సంభాషించుకోవడం, మీ ఇరువురి మధ్య దొర్లిన మాటలనుబట్టి 'మీరు ఒక ఆడపిల్లలు గల తండ్రి అని. వారి పెండ్లిండ్లు చేయడానికి చాలా అవస్థ పడుతున్నారని...గ్రహించాను. అప్పుడే నాకు అనిపించింది. మీ అమ్మాయిని పెండ్లి చేసుకోవాలని!'

కట్నాన్ని ఆశించకుండా పెండ్లి చేసుకోవాలనుకున్న నా ఆశయాన్ని రూపొందించుకోడానికి_సామాన్య కుటుంబానికి చెందిన ఆడపిల్లల తండ్రిగా,...మీరే నాకు తగిన మామగారని నిర్ణయించుకున్నాను, ఆ వెంటనే మీ



పి. ఎస్, ఆర్. పిక్చర్స్‌వారి ''రౌడీలకు రౌడీలు'' చిత్రంలో జ్యోతిలక్ష్మి,

మిత్రునికి నా నిర్ణయం తెలిపి మీతో పరిచయం చేసుకున్నాను. నా ఆశయాన్ని, నా నిర్ణయాన్ని విన్నప్పుడు సంతోషంగా మీ ముఖంలోని వెలుగు ఎంత చిమ్మిందో నా కిప్పటికీ గుర్తే! అయితే ఇప్పుడు నా జాబు అందుకుని, మీరు పడే ఆవేదనని ఊహించుకుంటే...వ్యథతో నా



• టర్‌నర్ 3 ఫేస్ మోటారులు.

• టర్‌నర్ జెట్ పంపులు.

• టర్‌నర్ సెంట్రిఫ్యూగల్ పంపులు.

1 H. P. నుంచి 20 H. P. వరకు.

తయారించువారు :

TURNER ENGINEERING COMPANY

PAPANAIKAN PALEM : : COIMBATORE-18.




* చక్కని అల్లిక.
* సరైన కొలత.
* తక్కువ ధర.
* చిరకాలమన్నిక.
ఇవే
మా విశిష్టత.


గుండె చెరువయి పోతోంది. మీ సంతోషాన్ని శాశ్వతంగా నిలుపలేని అశక్తుడిని?

మీతో సంబంధాన్ని కుదుర్చుకుంటున్నానని తెలిసి, నా తల్లిదండ్రులు నాకు తెలుపకుండానే...... వేరొక సంబంధాన్ని మాట్లాడి, పెండ్లి ఏర్పాట్లు చేసి, నన్ను మా స్వగ్రామం రప్పించారు. ఆ ఏర్పాట్లు చూడగానే సంభ్రమించిపోయాను. నాకీ వివాహం వద్దన్నాను. నా తల్లిదండ్రులు మాటలతో నన్ను బంధీకృతుడిని చేశారు. పరిస్థితులను ఎదుర్కోలేక, ఏమీ చేయలేని అసమర్థుడనయి తలవంచాను. నా జీవిత భాగస్వామిని నేనే నిర్ణయించుకొని, ఆమెతో ఆదర్శ దాంపత్యం గడుపుదామనుకున్నాను. నా ఆశయాలు నీటి బుడగల్లా శూన్యమయి పోయాయి! మీకు నిస్పృహ కలిగించాను. మన్నించండి.

మిమ్మలను మరువలేని—ప్రతాప్.

'ప్రతాప్! నీవు ప్రతాపము లేనివాడివి!' కోపంతో నా పండ్లు పటపట లాడినాయి.

కమల నాన్నగారిని చూశాను. ఆయన పడేబాధ నా మనసుని పిండిచేస్తోంది. 'పోనీయండి బాబాయిగారూ! మరొక వరుడు దొరక్కపోడు! అలా బాధపడకండి.' ఊరడింపుగా పలికాను.

'ఇంకేమి చేయనమ్మా? పెండ్లికొడుకులు దొరకడం అంత తేలికగా లేదు. ఇలాగయితే కమల పెండ్లి ఏమి



పి. ఎస్. ఆర్. పిక్చర్స్‌వారి
"రౌడీలకు రౌడీలు
చిత్రంలో
జ్యోతిలక్ష్మి-త్యాగరాజు.

చేయగలుగుతాను? ఆ తరువాత అమ్మాయిల పెండ్లిండ్లు ఎలా జరుపగలుగుతాను? సామాన్య కుటుంబంలో వేలుకి వేలు సమ్మరించడం ఎంతో కష్టం తల్లీ! ఆయన కంఠం గాద్గదికంగా ధ్వనించింది.

ఆయన అశాంతిని చూడలేక, నెమ్మదిగా కమల గది లోనికి వెళ్ళాను.

కమల మంచంమీద పడుకుని, కన్నీరు కార్చుతోంది. ఎంతో నిండుగా, ధైర్యంగా వుండే కమల కన్నీరు కార్చుతుంది!

'కమలా! ఛీ...లే! కన్నీరు తుడుచుకో.' నా చేతులతో ఆమె ముఖాన్ని నాప్రక్కకు తిప్పుకుని నాచీర కొంగుతో ఆమె కన్నీటి ధారను తుడిచాను.

కొద్దికాలం క్రితం సంతోషంతో నిండియున్న ఆమె ముఖం ఇప్పుడు విషాదంతో నిండుకుని వుంది!

'కమలా! ఏమైనా మాట్లాడు!' పలుకరించాను.

నన్ను చూసి కమల నవ్వింది. నిండుగా, గంభీరంగా నవ్వుతూ అంది.

'ఏమి మాట్లాడనే?'

అంత విషాదంలోను కమల నిండుగా నవ్వగలిగింది.

అందుకే కమలని చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. 'ఆమెకు ఎంతటి మనస్థైర్యం!'



రవీంద్ర ఆర్టు పిక్చర్స్‌వారి "సిసీంద్రి చిట్టిబాబు" చిత్రంలో నూతన తార నాగశ్రీ




మోటారు మరియు పంపు సామగ్రి



బెల్టుతో నడుపబడిన పంపు

ధనావారు తయారుచేయు వస్తువులను కొని

DHANA

తృప్తి పొందండి

పలువరుసలలో

లభించుచున్నవి

ధనా ఇంజనీరింగ్

ఇండస్ట్రీస్

అలగాపురి వీధి పొల్లాచి

దక్షిణ ఇండియా

క్రొత్త ప్రదేశములకు

ఏజంట్లు కావలయును